

నగరం.. చెత్తమయం...

- పారిశుద్ధ్య కార్మికుల ఖాళీలను భర్తీ చేయరు - డ్రెయినేజీలు అస్తవ్యస్తం - ప్రజలకు అవగాహన లేదంటున్న పాలకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మానవ శరీరం శుభ్రంగా ఉంటే అందంగా కనిపిస్తుంది. అలాగే నగరంలో చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేస్తే అందంగా కనిపిస్తుంది. కర్నూలు నగర జనాభాకనుగుణంగా పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో చెత్తను ఎంత శుభ్రం చేయాలో అంత చేయలేక పోతున్నారు. దీంతో అనేక నివాస ప్రాంతా చెత్త పేరుకుపోయినా ఎత్తేయలేక పోతున్నారు. దీనికి తోడు మురుగునీరు పారే కాల్వలు సక్రమంగా లేనందున రోడ్లపై మురుగునీరు పారుతుంది. ప్రజల్లో అవగాహన లేకదనే సాకుతే అధికారులు, ప్రజాప్రతినిధులు సమర్థించుకున్నారు. కర్నూలు నగర జనాభాకు అనుగుణంగా విస్తరించిన కాలనీలు కాకుండానే 1500 మంది పారిశుధ్య కార్మికులు ఉండాలి. కాని ప్రస్తుతం 1150 మంది మాత్రమే ఉన్నారు. నియామకానికి అనుమతి కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించామని అనుమతి వస్తే మిగతా కార్మికులను నియమించుకుంటామని కర్నూలు కార్పోరేషన్ అధికారులంటున్నారు. ఇటీవల ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కూడా విన్నవించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు పేపర్లు చెత్తాచెదారం ఇంట్లో వ్యర్థ పదార్థాలు అన్ని ఇంటింటికి చెత్త సేకరణకు వచ్చేవారికి ఇవ్వకుండా ఆలస్యమైతే కాలువలో పడేయడంతో కాలువలు ఎక్కడికక్కడ మూసుకుపోయి దోమల కేంద్రాలుగా మారుతున్నాయి. చెత్త సేకరణకు వచ్చే వారు ఎందుకు ఆలస్యంగా వస్తున్నారో చెప్పడం లేదు. దోమలు ద్వారా మలేరియా డెంగ్యూ చికెన్ గున్యా లాంటి జబ్బులతో ప్రజలు బాధపడుతున్నారు. దోమల బారిన పడి ప్రజలు రోగాల బారినపడి ఆసుపత్రుల పాలు కావాల్సి వస్తుంది. మురుగు కాలువల వ్యవస్థ పూర్తిస్థాయిలో లేకపోవడంతో మురుగునీరు ఖాళీ ప్రదేశాల్లో చేరి పందులకు దోమలకు నిలయంగా మారుతున్నాయి. నగరంలో దోమల నియంత్రణకు ఫాగింగ్ పొగవదులుతున్నప్పటికీ, ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్న దోమలను నియంత్రించ లేకపోతున్నారు. కర్నూలు నగరంలో చెత్త సేకరించేందుకు 91 క్లబ్ ఆటోలు, 12 డీజిల్ ఆటోలు, 19 ట్రాక్టర్లు, 15 కాంట్రాక్టర్లు ఐదు టిప్పర్లు, క్లాప్ ఆటోలకు 98 మంది డ్రైవర్లు, 1074 మంది పారిశుధ్య కార్మికులు, 19 మంది సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఒక సానిటరీ సూపర్వైజర్ పనిచేస్తున్నారు. ప్రతిరోజు 108 టన్నుల చెత్త సేకరించి వారు డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. 15 నుండి 20 టన్నుల తడి చెత్త నుండి ఎరువులు తయారు చేస్తున్నారు. 20 నుండి 30 టన్నుల పొడి చెత్తను జిందాల్ ఫ్యాక్టరీకి ఫ్రీగా ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు.



ప్రజల్లో అవగాహన లేకే చెత్తమయం

- ప్రజా ఆరోగ్య అధికారి కె. విశ్వేశ్వర్ రెడ్డి



అధికారులుగా ఎంత సేవలు చేసినా ప్రజల్లో అవగాహన లేనంతవరకు నగరం చెత్తమయంగానే ఉంటుంది. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడొద్దని చెప్పినా వాడుతున్నారు. వాటిని వాడిన తర్వాత మురుగు కాలువలో పడేయడం, చెత్తని ఇస్తే చెత్త పన్ను కట్టాల్సి వస్తుంది. ఇంటింటికి చెత్త సేకరించే వారికి ఇవ్వకపోవడం లాంటి కారణాలు ఉన్నాయి. నగరంలో ఉన్న 51 బ్లాక్ స్పాట్ల లో చెత్త వేయకుండా ఉండే విధంగా డస్ట్ బిన్లను తీసివేసి, డస్ట్ బిన్ ఫ్రీ సిటీగా చేయాలని ప్రజల్లో అవగాహన కల్పించాం. ఎంత చెప్పినా ఏమి చేసినా ప్రజల్లో అవగాహనతో మసలుకుంటే చెత్త లేకుండా అవుతుంది. ఇంటింటికి చెత్త సేకరణకు వచ్చే వారికి చెత్తను ఇచ్చి చెత్తలేని అందమైన నగరంగా తీర్చి దిద్దేందుకు ప్రజలు సహకరించాలి.

నగర జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను పెంచాలి

- సిఐటియు ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్



నగరంలో చెత్త సమస్య తీరాలంటే జనాభా కనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించాలి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లయితే ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కావు. ఎక్కడపడితే అక్కడ చెత్త ఉండదు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. ఎక్కడబడితే అక్కడ అనవసరం నిర్మాణాలు చేపట్టి నగర ఆదాయాన్ని అనవసరంగా వృధా చేయకుండా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మంచి కార్యక్రమాలు చేయాలి. అందరి మన్ననలు పొందాలి. కర్నూలు నగర ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా భావించి ఆ వైపు అడుగులు వేయాలి.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు చర్యలు

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్


మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు.గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివరిస్తూ ఫార్మ్-6 కు సంబంధించి 36,773, ఫార్మ్-7కు సంబంధించి 24,816, ఫార్మ్-8 కు సంబంధించి 17,592 వరకు పెండింగ్ ఉన్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి వివరించారు. ఒకే ఇంట్లో 10 మంది కంటే ఎక్కువ ఓటర్లు, జంక్ క్యారెక్టర్స్ మీద దృష్టి సారించి వాటిపై పరిశీలన జరుగుతోందన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు సమావేశంలో లేవనెత్తిన అంశాలను పూర్తి స్థాయిలో పరిష్కరించడంతో పాటు సదరు సమావేశాల మినిట్స్‌ను ఎప్పటికప్పుడే ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తామన్నారు. ఫోటో సిమిలర్ ఎంట్రీస్, డేమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్‌కు సంబంధించి వాటిని శనివారం నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ... ముసాయిదా ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా రూపొందించడానికి ఒక చెక్ లిస్టు పెట్టుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ జారీచేసిన మార్గదర్శకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో ఒకే రకమైన ఫోటోలు, ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి మారిపోయినవి, మృతులు, ఒక ఇంటి నెంబర్ పై 10 కంటే ఎక్కువ ఓట్లు, ఒకే వ్యక్తి పేరున రెండు మూడు అంతకన్నా ఎక్కువ ఓట్లు ఉండడం లాంటి సిమిలర్ ఓట్ల తొలగింపునకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు బాధ్యతాయుతంగా కృషి చేయాలని పేర్కొన్నారు. డిఆర్ఓ కె.మధుసూదన్ రావు, జిల్లా పరిషత్ సిఇఓ నాసర రెడ్డి, కర్నూలు ఆర్‌డిఓ హరిప్రసాద్, ఇఆర్‌ఓలు మల్లిఖార్జునడు, రమ, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పులు జరిగితే చర్యలు

జిల్లాలో చేపడుతున్న భూముల రీ సర్వేలో రెవెన్యూ , సర్వేయర్లు తప్పులు చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ జి.సృజనా హెచ్చరించారు. కలెక్టర్ పలు అంశాలపై టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ కి సంబంధించి పర్సెంటేజ్ ఆఫ్ గ్రౌండింగ్ శాతంలో హాలహర్వి మండలం తప్ప మిగిలిన మండలాలు అదే శాతం లోనే ఉన్నాయన్నారు. వచ్చే సోమవారం నాటికి ఏ మండలం అయినా 95 శాతం కంటే తక్కువ పురోగతి ఉంటే సంబంధిత మండలాల అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జెసి నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ రీ సర్వేకు సంబంధించి ఇప్పటివరకు 165 గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిందని, 122 గ్రామాలలో విలేజ్ సర్వేయర్, విఆర్ఓ లాగిన్‌లలో డేటా ఎంట్రీ పూర్తయిందన్నారు. 17 పురోగతిలో ఉన్నాయని ఇంకా 13 పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు. పెండింగ్ లోనున్న రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని జెసి సంబంధిత మండలాల అధికారులను ఆదేశించారు.

తాలూకా పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

- గ్రామాలలో శాంతిభద్రతల పై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు బి.తాండ్రపాడు సమీపంలోని కర్నూలు తాలుకా పోలీసు స్టేషన్‌ను గురువారం ఎస్‌పి జి.కృష్ణకాంత్ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణపై ఆరా తీశారు. రౌడీ షీటర్స్, చెడు ప్రవర్తన గల వారికి బాగా కౌన్సిలింగ్ చేయాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరగా పూర్తి చేయాలన్నారు. క్రైమ్ రేట్‌ను తగ్గించేందుకు బాగా పని చేయాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తగిన సూచనలు, సలహాలు చేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు , వాహనాల ధృవ పత్రాలు, ఇన్సూరెన్సులు కలిగి ఉండాలన్నారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎక్సైజ్ కేసులలో సీజ్ చేసిన వాహనాలను త్వరగా డిస్పోజ్ చేయాలన్నారు. జిల్లా ఎస్‌పి వెంట కర్నూలు తాలుకా పోలీసుస్టేషన్ సిఐ శ్రీరామ్, డిసిఆర్ బి సిఐ గుణశేఖర్ బాబు, ఎస్‌ఐలు సమీర్ బాషా, రామయ్య ఉన్నారు.


పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌పి కృష్ణకాంత్

3 వేల ఎకరాల భూ పంపిణీ చేస్తాం: జెసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని అసైన్‌మెంట్ కమిటీ ద్వారా 3 వేల ఎకరాలు భూమిని పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. గురువారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. భూమి లేని నిరుపేదలకు జిల్లాలో 2582 మంది లబ్దిదారులకు 3002.18 ఎకరాల (ఆదోని డివిజన్‌లో 1330 మంది లబ్దిదారులకు - 1375.45 ఎకరాలు, పత్తికొండ డివిజన్ లో 932 మంది లబ్దిదారులకు - 1203.99 ఎకరాలు, కర్నూలు డివిజన్ లో 320 మంది లబ్ధదారులకు - 422.74 ఎకరాల) కొత్త డి.పట్టాలను పంపిణీ చేయబోతున్నామన్నారు. ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ భూములకు సంబంధించి అసైన్‌మెంట్ ఇచ్చి 20 ఏళ్ల దాటిన వారికి ఫ్రీహోల్డ్ హక్కులు కల్పిస్తూ 22(ఎ) నుంచి తొలగించడం (డినోటిఫై) చేయడం జరుగుతుందన్నారు. విఆర్‌ఓలు, ఆర్‌డిఓలు, జాయింట్ కలెక్టర్ స్థాయిలో పరిశీలించి వెరిఫై చేసి డిపట్టాలు ఇచ్చినట్టు రుజువైతే వారి వారసులు ఉంటేనే తొలగించడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి ఆదోని డివిజన్ లో 484 మంది లబ్దిదారులకు - 702.71 ఎకరాలు, పత్తికొండడివిజన్ లో 2277 మంది లబ్ధదారులకు - 4540.57 ఎకరాలు, కర్నూలు డివిజన్ లోల 342 మంది లబ్ధదారులకు - 538.095ఎకరాలకు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పిస్తామన్నారు. గ్రామ సర్వీస్ ఇనామ్‌లకు 22(ఎ) నుంచి తొలగించడానికి సంబంధించి 15191 మంది లబ్దిదారులకు 23,838.92 ఎకరాలు (ఆదోని డివిజన్ లో 3328 మంది లబ్దిదారులకు - 5390.78 ఎకరాలు, పత్తికొండ డివిజన్ లో 2889 మంది లబ్దిదారులకు - 5944.00 ఎకరాలు, కర్నూలు డివిజన్ లో 8974 మంది లబ్దిదారులకు - 12,504.14 ఎకరాలు) సర్వీస్ ఇనామ్ తొలగించడం జరుగుతోందన్నారు. ల్యాండ్ పర్చేజ్ స్కీం కింద గతంలో ఎస్‌సి కార్పొరేషన్ వారు 2008లో మార్టిగేజ్ చేసుకున్న భూములను లబ్దిదారుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామన్నారు. జిల్లాలో 1762 మంది లబ్దిదారులకు 2794 ఎకరాల్లో వారికి రిజిస్ట్రేషన్ చేసి వారికి సొంత హక్కులు కల్పిస్తామన్నారు. ఎస్సీ కమ్యూనిటీ వారికి 103 స్మశాన వాటికలు గుర్తిస్తామన్నారు. స్పందనలో వచ్చిన గ్రామ కంఠం సర్వే చేసి 20 వేల ప్రాపర్టీ కార్డులను కూడా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి శుక్రవారం ఏలూరులో ప్రారంభించిన తరువాత జిల్లా స్థాయిలో ఈ నెల 18 నుంచి ఒక వారం రోజుల పాటు ప్రజా ప్రతినిధులతో పంపిణీ చేయిస్తామని జెసి వివరించారు


మాట్లాడుతున్న జెసి నారపురెడ్డి మౌర్య

ఓటర్ల జాబితా సవరణ పై సమీక్ష

పాణ్యం నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల జాబితా సవరణపై జాయింట్ కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఎఇఆర్‌ఓలు ముందుగా వారి పరిధిలో పెండింగులో ఉన్న ఫార్మ్ వచ్చే మంగళవారం నాటికి డిస్పోజ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పెండింగ్ లో ఉన్న పోలింగ్ స్టేషన్ లు కూడా త్వరితగతిన పరిశీలించాలన్నారు.

ఎసిబి వలలో నంద్యాల రవాణా శాఖ ఎఓ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నంద్యాల జిల్లా రవాణా శాఖలో ఎఓ సువర్ణ కుమారి ఇంట్లో, సోదరుల ఇంట్లో ఎసిబి అధికారుల తనిఖీల్లో రూ.తొమ్మిదిలక్షల నగదు, బంగారునగలు, డాక్యుమెంట్స్ ముఖ్యమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నామని కర్నూలు ఎసిబి డిఎస్‌పి వెంకటాద్రి తెలిపారు. ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు నగరంలో ధనలక్ష్మి నగర్‌లో నివాసముంటున్న సువర్ణ కుమారి ఇంటితో పాటు కర్నూలులో రెండు ప్రాంతాలు, నంద్యాల, బనగానపల్లె, మార్కాపురం, హైదరాబాదు కొని స్నేహితులు, బంధువుల ఇళ్లలో మొత్తం ఆరు చోట్ల ఏకకాలంలో ఆరు బృందాలుగా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. తనిఖీలు ఉదయం 6:30 గంటల నుంచి మొదలైనట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం అక్రమ ఆస్తుల విలువను లెక్కించే పనిలో తామున్నామని తెలిపారు. ఈ సోదాలు రేపటి వరకు కొనసాగుతాయని చెప్పారు. ఈతనిఖీల్లో ఎసిబి సిఐలు తేజేశ్వరరావు, కృష్ణారెడ్డి, కృష్ణయ్య, వంశీనాథ్, ఇంతియాజ్ పలువురు ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.


టిడిపి మేనిఫెస్టోను వివరిస్తున్న టిజి.భరత్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ఐదేళ్ల భవిష్యత్తు ప్రజల చేతుల్లోనే : టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఐదేళ్ల బంగారు భవిష్యత్తు ఎలా ఉండాలో ప్రజలే నిర్ణయించుకోవాలని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టిజి భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని 11వ వార్డు ఖడక్‌పుర, మేదరిగేరి ప్రాంతాల్లో నిర్వహించిన తెలుగుదేశం పిలుస్తోంది నగరమా మేలుకో కార్యక్రమంలో టిజి భరత్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. టిజి భరత్ మాట్లాడుతూ కర్నూలు నగర కమిటీ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు చేపట్టిన నగరమా మేలుకో కార్యక్రమం పది వార్డుల్లో దిగ్విజయంగా పూర్తైందన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం, కర్నూలుకు తన నాయకత్వం ఎంతో అవసరమని చెబుతూ నేతలు ప్రజల్లోకి వెళుతున్నారన్నారు. డెవలప్‌మెంట్ చేసే నాయకులు ఎవరో ప్రజలు ఆలోచించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఓటు వేసే ముందు ప్రజలు ఒక్కసారి గుర్తించుకోవాలన్నారు. సరైన నాయకుడిని ఎన్నుకుంటే ఐదేళ్లపాటు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. లేదంటే ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మెహబూబ్ ఖాన్, మన్సూర్ ఆలీఖాన్, అబ్బాస్, నౌషాద్, ఏసు, విజయలక్ష్మి, లలితమ్మ, నాగేశ్వరమ్మ, క్లస్టర్ ఇంచార్జీలు, వార్డు ఇంచార్జీలు, బూత్ ఇంచార్జీలు, తదితర నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్లస్థలాల కేటాయింపు జిఒను సవరించాలి

ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు ఎపిడబ్ల్యుజెఎఫ్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించే నియమనిబంధన ఉత్తర్వులో కొన్ని సవరణలు చేయాలని కోరుతూ గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన ప్రెస్‌అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దులేటి, నగర అధ్యక్షులు శివకుమార్, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఉపాధ్యక్షులు రమేష్, సీనియర్ జర్నలిస్టు సత్యన్న వినతిని అందజేశారు. కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా శాఖల నుంచి వచ్చిన అభిప్రాయాలు రాష్ట్ర కమిటీ నిర్ణయాలు మీడియా చైర్మన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు మాట్లాడుతూ నిబంధనల్లో 60/40ని రద్దు చేసి జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా నామమాత్రపు ధరకు ఇవ్వాలన్నారు. రాష్ట్ర కేంద్రంలో ఐదేళ్ళ, జిల్లాలో మూడు సంవత్సరాల అనుభవం గల జర్నలిస్టులందరికీ ఇంటిస్థలం కేటాయించేందుకు వీలుగా నిబంధన సవరించాలన్నారు. దరఖాస్తు చేసుకునేవారికి అక్రెడిటేషన్ లేదా యాజమాన్యం ఇచ్చే నియామక ఉత్తర్వు పరిగణలోకి తీసుకోవాలన్నారు. నియోజకవర్గానికి 2 అక్రిడేషన్లలో భాగంగా జిల్లాల్లో చాలా మందికి అక్రిడేషన్ కార్డులు మంజూరు కాలేదని, అందుకు గాను యాజమాన్యం ఇచ్చే నియామక ఉత్తర్వులను పరిగణలోకి తీసుకోవాలన్నారు.


ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్నఎపిడబ్ల్యుజెఎఫ్ నేత మద్దిలేటి

అర్హులైన జర్నలిస్టులందరికీ స్థలాలు ఇవ్వాలి

కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఫోటో వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మీసాల రామస్వామి డిమాండ్ చేశారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ ఫోటో వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు ఇచ్చిన జిఒలో నిబంధనలు మార్పులు చేయాలన్నారు. జర్నలిస్టులు శ్రీనివాసులు, సురేష్, చెన్నయ్య, రమేష్,నజీర్ విజయ్ ఉన్నారు.

సంక్షేమం అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వ రికార్డులు అద్భుతం

ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

సంక్షేమం, సంస్కరణలు, అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన రికార్డులు అద్భుతమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని పశు సంవర్ధక శాఖ కార్యాలయం గోకులం కాన్ఫరెన్స్ హాలులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో 99 శాతం వరకు నెరవేర్చిందన్నారు. రూ.లక్షా 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని, 2 లక్షల 50 వేల మంది వాలంటీర్లను నియమించారని పేర్కొన్నారు. ముఖ్యంగా దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.2.5 లక్షల కోట్ల నిధులను వివిధ స్కీముల ద్వారా ఒక్క రూపాయి అవినీతి లేకుండా పంపిణీ చేసిందని తెలిపారు. గతంలో రాజీవ్ గాంధీ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న నిధులలో పావలా శాతం కూడా కిందిస్థాయికి చేరడం లేదని చెప్పారన్నారు. కానీ ఇప్పుడు లబ్ధిదారులకు డిబిటి (డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్) ద్వారా ఒక్క రూపాయి అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి రాష్ట్ర ప్రభుత్వమేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. గతంలో ప్రభుత్వాలకంటే ఇప్పుడు అభివృద్ధిని జోడించి చూస్తే ఎవరు బాగా చేసారో తెలుస్తుందన్నారు. పాత్రికేయుల సమావేశంలో సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ, మీడియా అకాడమీ చైర్మన్ ఓఎస్‌డి శ్రీనివాస్ జీవన్ పాల్గొన్నారు.

ఎస్‌టిల సంక్షేమానికి చర్యలు : జెసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్


బిర్సాముండా తదితరులకు నివాళ్లు అర్పిస్తున్న జెసి మౌర్య


జిల్లాలో ఎస్‌టిల సంక్షేమానికి అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో భగవాన్ బిర్సాముండా జయంతి సందర్భంగా నిర్వహించిన జన్‌జాతీయ గౌరవ దివస్‌లో భగవాన్ బిర్సా ముండా , ఇతర గిరిజన నాయకులకు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఘనంగా పుష్పాంజలి ఘటించారు. జెసి మాట్లాడుతూ ఐఎఎస్ ట్రైనింగ్‌లో శ్రీ భగవాన్ బిర్సా ముండా వారి గురించి చదవడం జరిగిందన్నారు. బ్రిటిష్ వలస ప్రభుత్వ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన ప్రముఖ గిరిజన నాయకుడు భగవాన్ బిర్సా ముండా అని ఆయన చరిత్ర వలన స్ఫూర్తి పొందానన్నారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధు లందరిని సత్కరించడానికి , స్వాతంత్ర్య పోరాటం, సాంస్కృతిక వారసత్వం , పునఃస్మరించుకోవడానికి భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా ఈనెల 15నుంచి 26 వరకు జనజాతీయ గౌరవ దివస్ ను నిర్వహించాలని భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్ణయించిందన్నారు. వారి సూచనల ప్రకారం స్వాతంత్ర్య సమరయోధులు భగవాన్ బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు, గంటం దొర, బోనంగి పండు పడాల్, గాంమల్లు దొర, హనుమంతప్ప, కుడుముల పెద్ద బయన్న వారి చిత్ర పటాలకు పూలమాలలతో నివాళ్లు అర్పించామన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ , సాధికారత అధికారి శ్రీనివాస కుమార్, గిరిజన నాయకులు, ఇతర అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.


కారు ఆపి నడిచి వెళ్తున్న విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధాకర్

విద్యార్థుల పట్ల ఔదార్యం చాటిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని గొల్లలదొడ్డికి చెందిన విద్యార్థిని, విద్యార్థుల పట్ల కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ ఔదార్యం చాటుకున్నారు. గురువారం గొల్లలదొడ్డికి మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా ముందుగా సి బెళగల్‌కు చేరుకొని గొల్లలదొడ్డి రోడ్డులో వెళ్తుండగా నడచి వెళ్తున్న విద్యార్థులతో ముచ్చటించి బడి బస్సు వేళలపై ఆరా తీశారు. కర్నూలు డిపో బస్సు గత నెల కిందటి వరకు బడివేళలకే వచ్చేదని, వేళలు మార్పు చేయడంతో సి.బెళగల్‌లో మోడల్ స్కూల్, హైస్కూల్‌కు వెళ్లి రావాలంటే అవస్థలుపడుతున్నట్లు ఎమ్మెల్యేతో వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి ఆ వెంటనే సుమారు 38 మంది విద్యార్థులను తమ కారులో, పోలీస్ కారులోన ఎక్కించుకొని మా నమ్మకం నువ్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వచ్చే ఎన్నికల్లో టిడిపిని చిత్తుగా ఓడించాలని, వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.



రీవ్యూ మీటింగ్‌లో మాట్లాడుతున్న హఫీజ్‌ఖాన్

పనులు వేగంగా పూర్తి చేయాలి

రీవ్యూ మీటింగ్ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ సూచించారు. 1వ వార్డు 2వ వార్డ్ , 4వ వార్డ్ కార్పొరేటర్లతో స్థానిక నాయకులతో సచివాలయం సిబ్బంది మున్సిపల్ సిబ్బంది ఎలక్ట్రిక్ డిపార్టుమెంట్, సచివాలయం కన్వీనర్లు గృహసారథులతో, వార్డ్ సామాన్య ప్రజలతో కలిసి గురువారం సమీక్షించారు. వార్డు సమస్యలను త్వరగా పరిష్కరించాలని చెప్పారు. జరగబోయే పనులను త్వరలో పూర్తి చేయాలని ఎమ్మెల్యేకు స్థానిక వార్డ్ ప్రజలు తెలుపగా ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ వెంటనే పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వార్డ్ ప్రజలు ఎమ్మెల్యతో మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసినప్పుడు తమ దృష్టికి వచ్చిన పనులు పూర్తి చేసినందుకు ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వేగంగా బండ పరుపు పనులు

- పర్యవేక్షించిన సహాయ కమిషనర్ వాణి

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్య క్షేత్రాల్లో ఒకటైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్య క్షేత్రం అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి కృషి వల్ల పాలక మండలి కమిటీ ఛైర్మన్ నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో ఉరుకుంద పుణ్యక్షేత్రంలో గ్రానైట్ బండ పరుపు పనులకు రూ.1.28 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో గ్రానైట్ బండ పరుపు పనులు, అండర్ గ్రౌండ్ పైపులైన్ పనులు వేగవంతంగా జరిగేలా సహాయ కమిషనర్ వాణి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే 4 రాజగోపురాలతో పాటు మహా ప్రాకారం ప్రహరీ పనులు పూర్తయ్యాయి. ప్రధాన రాజ గోపురం పనులు పూర్తయితే ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టడానికి పాలకమండలి, దేవాలయ అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రహరీ అంతర్భాగంలో గ్రానైట్ బండ పరుపు పనులు ముమ్మరం గా సాగుతున్నాయి. పనులను దేవాలయ సహాయ కమిషనర్ వాణి, పర్యవేక్షకులు వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, రామానందం గురువారం పరిశీలించారు.



పనులను పర్యవేక్షిస్తున్న సహాయ కమిషనర్ వాణి

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- డిఎల్‌పిఒ శ్రీనివాసులు

ప్రజాశక్తి - కోసిగి

పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని ఆదోని డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాసులు తెలిపారు. గురువారం కోసిగి మేజర్ పంచాయతీ సర్పంచి అయ్యమ్మ ఆధ్వర్యంలో గ్రామంలో డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త, చెదారాలను పారిశుధ్య కార్మికులు తొలగించి, గ్రామ వీధులను శుభ్రం చేశారు. డిఎల్‌పిఒ శ్రీనివాసులు ప్రత్యేకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంటువ్యాధులు సోకకుండా దోమలను నివారించడానికి ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తాగునీటి వేడి చేసి చల్లార్చుకుని తాగాలన్నారు. దోమల బారిన పడకుండా దోమతెరలను వాడాలని సూచించారు. ఇన్‌ఛార్జి ఇఒ చంద్రశేఖర్, వైసిపి యువ నాయకులు రాజేష్ పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

- తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఇఒఆర్‌డి బాలన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

'జగనన్నకు చెబుదాం, స్పందన' ద్వారా వచ్చిన సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఇఒఆర్‌డి బాలన్న తెలిపారు. గురువారం చిప్పగిరి సచివాలయ కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం, స్పందన'ను సర్పంచి గోవిందరాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతు భరోసా నిధులు రావడం లేదని ఒక రైతు సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన ఎఒ జయలక్ష్మి రైతు సమస్యను పరిశీలించగా కుటుంబంలో చనిపోయిన వ్యక్తి పేరు కనిపిస్తుందని, అధికారులతో ధ్రువీకరించిన మరణ ధ్రువపత్రాన్ని రైతు భరోసా దరఖాస్తుకు జత చేసి పంపిస్తామని, రైతు భరోసా డబ్బులు కూడా వస్తాయని తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, వెటర్నరీ డాక్టర్ ప్రసన్న బాయ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

స్టాంప్ నిర్ణయంతో ఇబ్బందులు

- మంత్రి జయరామ్‌ను కలిసిన జిల్లా బార్ కౌన్సిల్ సభ్యులు

ప్రజాశక్తి-ఆలూరు

బార్ అసోసియేషన్ అభిప్రాయం తీసుకోకుండా రూ.20 స్టాంప్‌ను ప్రతి మధ్యంతర పిటిషన్లపై వేయాలని ఏకపక్షంగా నిర్ణయం తీసుకోడంతో కక్షిదారులు, న్యాయవాదులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని న్యాయవాదులు తెలిపారు. ఈ విషయంలో న్యాయవాదులు నెల రోజుల నుంచి కోర్టు విధులను బహిష్కరించి నిరసనను తెలియజేస్తున్నట్లు చెప్పారు. గురువారం మంత్రి గుమ్మనూరు జయరామ్‌కువ వినతిపత్రం అందజేశారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. వైసిపి లీగల్ సెల్ జోనల్ ఇన్‌ఛార్జి ప్రభాకర్, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ సువర్ణ రెడ్డి, ఆలూరు కన్వీనర్ లక్ష్మీకాంత్, ఎపి వక్ఫ్ బోర్డ్ సభ్యులు నజీర్ బాషా, న్యాయవాదులు ఆనంద్, సురేంద్ర కుమార్, మాధవ కృష్ణ, మల్లికార్జున, అంజినప్ప, రాజేష్ పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

ఆర్‌టిసి బస్టాండ్ ఆధునీకరణకు నిధులు మంజూరు

- గుమ్మనూరు నారాయణ స్వామి

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు ఆర్‌టిసి బస్టాండ్ ఆధునీకరణకు నిధులు మంజూరయి టెండర్లు పూర్తయినట్లు మంత్రి సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి తెలిపారు. ఆలూరు ఆర్‌టిసి బస్టాండ్ ఆధునీకరణకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గురువారం కొత్త బస్టాండ్ ఆవరణలో గుమ్మనూరు నారాయణ స్వామి, ఆర్‌టిసి జిల్లా రీజినల్ అధికారి వెంకటరమణ, ఆదోని డిపో మేనేజర్ మహ్మద్ రఫీ భూమిపూజ చేశారు. రూ.33.50 లక్షలతో సిసి రోడ్లు, ప్రహరీ, ప్రయాణికుల కోసం మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి దేవనకొండ మీదుగా ఆలూరుకు, గుంతకల్ నుంచి ఆలూరు, ఆలూరు నుంచి బెంగళూరుకు బస్ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరారు. మంత్రి జయరామ్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఆర్‌టిసి డిప్యూటీ ఇఇ వెంకటేశ్వర రావు, ట్రాఫిక్ ఇన్‌ఛార్జి రాఘవేంద్ర, ఎంపిపి రంగమ్మ, వైసిపి మండల కన్వీనర్ వీరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ స్వామి

ఉప సర్పంచి ఎన్నిక ఏకగ్రీవం

- ఉప సర్పంచిగా రజియాబీ

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ మేజర్ పంచాయతీ ఉప సర్పంచి ఎన్నిక ఏకగ్రీవమైంది. గురువారం పంచాయతీ కార్యాలయంలో ఇఒఆర్‌డి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు అబ్దుల్ రహీం, రిబిక ఆధ్వర్యంలో ఎన్నిక చేపట్టారు. మొత్తం 14 వార్డు సభ్యులకు గాను 8 మంది వార్డు సభ్యులు రజియాబీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉప సర్పంచి ఎన్నిక సమయంలో రెండున్నర ఏళ్లు ఎర్రగోటి నరసన్న, మరో రెండున్నర ఏళ్లు రజియాబీకి ఇవ్వాలనే ఒప్పందం చేసుకున్నారు. మొదట పదవి చేపట్టిన ఉప సర్పంచి రెండున్నర ఏళ్లు పూర్తి కావడంతో ఒప్పందం ప్రకారం ఉప సర్పంచి పదవి మరొకరికి ఇవ్వాల్సి ఉండగా వార్డు సభ్యులు తమకే కావాలని పోటీ పడ్డారు. వైసిపి మద్దతు వార్డు సభ్యులు ఉప సర్పంచి పదవి దక్కించుకోవాలని ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన టిడిపి మద్దతు మెజార్టీ వార్డు సభ్యులు సమావేశం ఏర్పాటు చేసుకొని ఒక ఒప్పందానికి వచ్చి 8 మంది వార్డు సభ్యులు పింజరి రజియాబీని ప్రతిపాదించారు. ఈ మేరకు అధికారులు ఏకగ్రీవంగా ఉప సర్పంచి పదవి ధ్రువీకరణ పత్రాలు రజియాబీకి అందజేశారు. సర్పంచి రంగ లక్ష్మి, టిడిపి నాయకులు బడి గింజల రంగన్న, ఉచ్చీరప్ప, రామారావు నాయుడు, మాలిక్, ఆకుల వీరేష్, రాజా సాబ్, మాల బండ్లయ్య, సుభాన్, మస్తాన్, రాముడు పాల్గొని రజియాబీకి పూలమాల వేసి సన్మానించారు.



ధ్రువపత్రం అందజేస్తున్న ఇఒఆర్‌డి సూర్యనారాయణ

రాష్ట్రాభివృద్ధికి ఉమ్మడి కార్యాచరణ

- జగన్‌ను ఓడించడమే లక్ష్యం

- టిడిపి, జనసేన ఆత్మీయ సమ్మేళనంలో నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రాభివృద్ధికి టిడిపి, జనసేన ఉమ్మడి కార్యాచరణ చేస్తున్నట్లు, 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌ను గద్దె దించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్‌రెడ్డి, టిడిపి నియోజకవర్గ పరిశీలకులు శ్రీరాములు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రేఖ గౌడ్, జిల్లా నాయకులు చల్లా శ్రీవరుణ్ తెలిపారు. గురువారం మాచాని సోమప్ప మెమోరియల్ హాలులో నియోజకవర్గ టిడిపి, జనసేన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రానున్న రోజుల్లో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను, జనసేన ప్రవేశ పెట్టిన షణ్ముఖ 5 పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. అవినీతి, అరాచక పాలన కొనసాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్యాచరణ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. టిడిపి నాయకులు సుందర్ రాజు, కొండయ్య చౌదరి, కలీముల్లా, రంగస్వామి గౌడ్, మధుబాబు, మల్లికార్జున, డీలర్ మాబు, నాగరాజ్ గౌడ్, పుష్పవతి, గురురాజు దేశాయి, రాముడు, కాసీం వలీ, శ్రీధర్ నాయుడు, కృష్ణం నాయుడు, నజీర్ అహ్మద్, తిరుపతయ్య నాయుడు, అడ్వకేట్ చంద్రశేఖర్, అడ్వకేట్ చంద్రశేఖర్, మదీనా సాహెబ్, పార్లపల్లి మల్లికార్జున, అయ్యలప్ప, నాగరాజు, సోమేశ్వర్ రెడ్డి, వెంకటేష్, జనసేన నాయకులు మున్నా, నవీన్ కుమార్, మహబూబ్ బాషా, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

సమస్యల పరిష్కారానికే స్పందన

- ఎంపిడిఒ సుబ్బరాజు, తహశీల్దార్ రామేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం, స్పందన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సుబ్బరాజు, తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం కామవరం పంచాయతీలో 'జగనన్నకు చెబుదాం, స్పందన' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా సమస్యలను ప్రజల వద్దకే వెళ్లి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (హౌసింగ్) లాలి కృష్ణయ్య, ఎఒ శేషాద్రి, ఎంఇఒ-2 శోభా రాణి, ఎపిఎం రాజశేఖర్, పశు వైద్యాధికారి జగదీష్ బాబు, పంచాయతీ సెక్రటరీ శివప్ప పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

99 శాతం హామీలు నెరవేర్చిన జగన్ : వైసిపి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎన్నికల ముందు మేనిఫెస్టో ద్వారా ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని వైసిపి మండల ఇన్‌ఛార్జి విశ్వనాథ్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కలుదేవకుంట గ్రామంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. నవరత్నాల పేరుతో ప్రభుత్వం విడుదల చేసిన సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందేలా చేసిన ఘనత జగన్‌దేనన్నారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వైసిపి యువనేత విఖ్యాత్ రెడ్డి, సొసైటీ సిఇఒ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వైసిపి జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కరువుపై ముఖ్యమంత్రి స్పందించాలి

- టిడిపి ఇన్‌ఛార్జి మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు చేసిన పంటలు చేతికందక కరువుతో అల్లాడుతున్నా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్పందించకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జి మీనాక్షి నాయుడు తెలిపారు. గురువారం మండలంలోని బైచిగేరి గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను, బాండ్లను అందించి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజావేదిక సమావేశంలో మీనాక్షి నాయుడు మాట్లాడారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండకట్టి, టిడిపి చేపట్టే పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. బాబు అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమాల గురించి వివరించారు. రామస్వామి, రంగన్న, ఆరేకల్ రామకృష్ణ, దొడ్డనకేరి శివప్ప, ధన సింగ్, రాముడు, లక్ష్మన్న, నాగరాజ్, భగవాన్ సింగ్, హనుమసింగ్, రాజు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఆదోని : ప్రతిపక్షాలపై పెట్టే ప్రతి కేసు కూడా వైసిపిపై ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోందని టిడిపి మాజీ ఇన్‌ఛార్జి గుడిసె ఆది కృష్ణమ్మ, జిల్లా మైనార్టీ అధ్యక్షులు అప్సర్ బాష, ఆదోని మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మనోహరయ్య శెట్టి, టిడిపి నాయకులు బెస్త నరసింహ (చిట్టి) తెలిపారు. 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా ఆదోనిలోని విక్టోరియా పేటలో పర్యటించారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ ఓటమి కళ్ల ముందే కనిపిస్తోందన్నారు. కడప జిల్లాలోని పులివెందులలో జగన్ పునాదులు కదులుతున్నాయని తెలిపారు. జగన్ ఓర్వలేకనే అక్రమ కేసులతో టిడిపి నాయకులను అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. కడప జిల్లాలో ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి, పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవి అరెస్టుతోనే ప్రతిపక్షం అంటే జగన్ ఎంతగా భయపడుతున్నారో అర్థమవుతోందని చెప్పారు. పులివెందులలో టిడిపి పుంజుకోవడంతో తన మార్కు అక్రమ కేసులతో భయపెట్టే చర్యలకు దిగారని విమర్శించారు. కడప జిల్లాలో, పులివెందులలో తీవ్ర వర్షాభావంతో రైతులు బాధపడుతుంటే ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులే ప్రధానం అన్నట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సొంత జిల్లాలో చేసిన అభివృద్ధి పనుల గురించో, కట్టిన ప్రాజెక్టుల గురించో, తెచ్చిన కంపెనీల గురించో చెప్పుకుంటారని, జగన్ ఏ నియోజకవర్గంలో ఎన్ని అక్రమ కేసులు పెట్టానో మాత్రమే చెప్పుకునే పరిస్థితి ఉందన్నారు. టిడిపి నాయకులు వడ్డెమాన్ గోపాల్, మురళి, ఆదోని పట్టణ ముస్లిం, మైనార్టీ నాయకులు సాధిక్ వలీ, కర్నూలు జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు జి.రామకృష్ణ, ఖాదర్ బాష, చిరంజీవి, వేమన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మీనాక్షి నాయుడు



మేనిఫెస్టోను వివరిస్తున్న గుడిసె ఆది కృష్ణమ్మ

'ప్రజాస్వామ్యంలో ఓటు విలువ'పై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రజాస్వామ్యంలో ఓటు విలువ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను గ్రంథాలయ అధికారి విశ్వనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ విద్యార్థులకు ఓటు విలువపై, 6, 7వ తరగతి విద్యార్థులకు సమాజంలో గ్రంథాలయాల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విజేత, నోబుల్, నారాయణ పాఠశాలల్లో చదువుతున్న 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడారు. పాఠ్య పుస్తకాలు చదవడంతో పాటు పేపర్ కూడా చదవాలని, పేపర్ ద్వారా సంజంలో జరిగే విషయాలు తెలుసుకోవచ్చని చెప్పారు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ కుమారి, ఉపాధ్యాయులు వెంకట రాముడు, జైపాల్, విజేత, నోబుల్, నారాయణ పాఠశాలల ఉపాధ్యాయులు బాలరాజు, రామకృష్ణ, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలి

- రాయలసీమ ప్రజాసంఘాల సమన్వయ వేదిక నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలని రాయలసీమ ప్రజాసంఘాల సమన్వయ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆడా కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి అధ్యక్షత వహించారు. ఆర్‌సిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, ఆదినారాయణ మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీల ప్రకారం ప్రత్యేక హోదా కోల్పోయామని తెలిపారు. రాయలసీమ బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ, గుంతకల్ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ కార్యరూపం దాల్చలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పరిపాలన ఆమోదం పొందిన గుండ్రేవుల జాడలేదని తెలిపారు. ఇటీవల కర్ణాటక రాష్ట్ర ఎన్నికల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 'అప్పర్ భద్ర'కు జాతీయ ప్రాజెక్టు హోదా కల్పిస్తూ గణనీయమైన నిధులు విడుదల చేసిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పునః పంపిణీకి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు విధివిధానాలు నిర్ణయించి, అధికారం ఇస్తూ కేంద్రం జిఒ విడుదల చేసిందని తెలిపారు. ప్రశ్నిస్తూ హక్కుల కోసం ఉద్యమించకపోతే ఈ ప్రాంతం ఎడారిగా మారుతుందని చెప్పారు. **ఎమ్మిగనూరులో** రాయలసీమ ప్రజా సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వేదిక కన్వీనర్ నాగన్న, ఆర్‌ఎవిఎఫ్ నాయకులు కృష్ణ, రైతుసంఘం నాయకులు రాజు, బతకన్న, హనీఫ్, నాగరాజు పాల్గొన్నారు.



ఆదోనిలో మాట్లాడుతున్న నాయకులు

మునిసిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలి

- ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, ఆదోని కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు జ్ఞానమద్దయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆదోనిలోని మున్సిపల్ పాఠశాలలో వారు మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి విద్యా శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించి పర్యవేక్షణ, పరిపాలన నిమిత్తం విద్యాశాఖ కిందికి వచ్చి సంవత్సరం గడిచినా పంచాయతీ రాజ్ వ్యవస్థలోని ఉపాధ్యాయుల మాదిరి మున్సిపల్ ఉపాధ్యాయులకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు. సమాఖ్య నాయకులు ఆనంద్, సీనియర్ ఉపాధ్యాయులు నూర్ బాషా, సర్తాజ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ముగిసిన అయ్యప్ప స్వాముల పాదయాత్ర

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణానికి చెందిన 8మంది అయ్యప్ప మాలధారులు గతనెల 17న పట్టణం నుంచి శబరిమలకు చేపట్టిన పాదయాత్ర ఈనెల 16న దిగ్విజయంగా ముగిసినట్లు గురుస్వామి శ్రీనివాస్ ఆచారి తెలిపారు. గురువారం ఆయన ఫోన్ ద్వారా మాట్లాడారు. గత కొన్ని ఏళ్లుగా పాదయాత్ర చేస్తున్నామని, సుమారు నెలపాటు వెయ్యి కిలోమీటర్ల వరకు పాదయాత్ర కొనసాగిందని తెలిపారు. 30 రోజులు నడక మార్గంలో ప్రయాణించి శబరిమల కొండలు చేరుకున్నామని చెప్పారు. ప్రతేడాది కార్తీక మాసం శబరిమలలో అయ్యప్పను దర్శించుకుంటామని తెలిపారు. మార్గమధ్యంలో ఎక్కడ చీకటైతే అక్కడ ఉన్న దేవాలయాన్ని ఎంచుకుని రాత్రి సేదదీరుతామని చెప్పారు. పాదయాత్ర వెంట తమకు అవసరమైన సరుకులు తీసుకెళ్తామన్నారు. వంట చేసుకునే వెసలుబాటు లేకపోతే స్వాముల కోసం ప్రత్యేకమైన భోజనం అందజేసే హోటళ్లలో భిక్ష చేసినట్లు తెలిపారు. స్వాములు ప్రహ్లాద, వెంకటేష్, దాస్, మునిస్వామి, విజయ్, సోము, కిషోర్, బద్రి ఉన్నారు.



అయ్యప్ప స్వామి సన్నిధిలో భక్తులు

భవనాల ఏర్పాటుకు సహకరించండి

- రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మధుసూదన శర్మ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో బ్రాహ్మణ భవనాల ఏర్పాటుకు సహకరించాలని రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెల్లాల మధుసూదన శర్మ కోరారు. గురువారం రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పేరి కామేశ్వరరావుకు, రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రభుత్వ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విజయవాడలోని దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రభుత్వ సలహాదారులు శ్రీకాంత్ కార్యాలయంలో ఇద్దరు నాయకులతో సమావేశమైనట్లు చెప్పారు. రాష్ట్రంలోని బ్రాహ్మణ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో బ్రాహ్మణులు శుభకార్యాలు, సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానాకి సొంత భవనాల్లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అలాగే చిన్న, చిన్న పట్టణాల్లో బ్రాహ్మణులు అపరకర్మలు చేసుకోవడానికి సరైన వసతులు లేకపోవడంతో వేరే క్షేత్రాలకు వెళ్లి చేసుకుంటున్నారని తెలిపారు. ఆదోనిలో దాదాపు 2వేల బ్రాహ్మణ కుటుంబాలు ఉన్నాయని, అపరకర్మలు చేసుకోవడానికి చిన్నపాటి స్థలం, నీటి వసతి లేదని చెప్పారు. వారు సానుకూలంగా స్పందించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి బ్రాహ్మణులకు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర బ్రాహ్మణ మహిళా విభాగం అధ్యక్షులు నిట్టల శైలజ, రాష్ట్ర బ్రాహ్మణ యువజన విభాగం అధ్యక్షులు సీతారామ్, సత్యనారాయణ శర్మ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మధుసూదన శర్మ

శిథిలావస్థలో పార్కు...

- ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

శిథిలావస్థకు చేరుకున్న ఆదోని హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులోని సామగ్రికి మరమ్మతులు చేపట్టాలని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. గురువారం పార్కులను సందర్శించి తుప్పు పట్టిన పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తుప్పు పట్టిన ఆట వస్తువులతో చిన్నారులకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వెంటనే నూతన పరికరాలను అమర్చాలని, గోడలను పటిష్ట పరిచి బయటి జంతువులు లోపలికి రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు.



వైసిపితోనే జనరంజక పాలన

- దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం జనరంజక పాలన సాగిస్తోందని రాష్ట్ర ఉపాధి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ సోదరుడు, దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు తెలిపారు. గురువారం గ్రామ సచివాలయ ఆవరణలో వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, వైసిపి నాయకులు దివాకర్ నాయుడు ఆధ్వర్యంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ముందుగా వైసిపి జెండాను ఆవిష్కరించి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడారు. సచివాలయ, వాలంటీరు వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కప్పట్రాళ్ల సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా రూ.29.69 కోట్ల ప్రజలకు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించాల్సిన అందరిపైనా ఉందన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎంపిడిఒ గౌరీదేవి, ఇఒఆర్‌డి సూర్యనారాయణ, జడ్‌పిటిసి కిట్టు, ఎంపిపి భర్త లుముంబా, జెసిఎస్ మండల కోఆర్డినేటర్ రాజారెడ్డి, తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్, వైసిపి నాయకులు నారాయణరెడ్డి, పల్లెదొడ్డి చంద్రన్న, చాప వీరన్న, రాఘవేంద్ర, పెద్ద లింగన్న, కృష్ణ, వడ్డే ఉరుకుందు, రామాంజనేయులు పాల్గొన్నారు.


మంత్రాలయం మండలంలోని సూగూరు గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బుక్ లెట్‌ను అందజేసి, పథకాల వివరాలను చదివి వినిపిస్తూ ముందుకు సాగారు. గడపగడపకు తిరుగుతున్న సమయంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. ఎస్ఐ వేణు గోపాల్ రాజ్ ఉన్నారు.



మాట్లాడుతున్న గుమ్మనూరు శ్రీనివాసులు



ప్రజలకు వివరిస్తున్న ప్రదీప్ రెడ్డి





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, డిఆర్ఓ పుల్లయ్య తదితరులు

సాగునీటి కష్టాలు..

- నవంబర్ చివరి వరకే నీటి విడుదలకు అవకాశం
- చివరాయకట్టుకు అందని సాగునీరు
- ఈ పది రోజుల్లో వర్షాలు పడితేనే మళ్లీ రిజర్వాయర్‌ల్లోకి నీళ్లు
- పంటలు ఎండిపోతుండడంతో అన్నదాతలు ఆందోళన బాట



జిల్లెల్ల గ్రామం వద్ద కెసి కెనాల్ 16వ లాక్ తూము వద్ద నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రైతన్నకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. రబీ సీజన్‌లో వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు వరి, మిరప, పత్తి, జొన్న, శనగ తదితర పంటలను సాగు చేశారు. కానీ ప్రకృతి కరుణించకపోవడంతో రైతులు రబీలోనూ కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది వర్షాలు ఆశించినంతగా పడకపోవడం, పై నుండి వచ్చిన వరద నీటిని జిల్లాకు ఖరీఫ్, రబీ సాగుకు అవసరమైన నిల్వ ఉంచుకునే రిజర్వాయర్లు లేకపోవడం వంటి కారణాలు రైతన్నకు శాపంగా మారువుతున్నాయి. ఖరీఫ్‌లో రైతులు సాగు చేసుకున్న పంటలకు కూడా పూర్తి స్థాయిలో నీటిని ఇవ్వలేని పరిస్థితి ఉంది.

ప్రస్తుతం సుంకేసుల బ్యారేజ్‌లో 80 వేల క్యూసెక్కుల నీరు, శ్రీశైలం రిజర్వాయర్‌లో 65 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉంది. తెలుగు గంగ రిజర్వాయర్‌లో 5 టిఎంసిలు, గోరుకల్లు రిజర్వాయర్లో ప్రస్తుతం 5.9 టిఎంసిలు, అవుకు రిజర్వాయర్‌లో 1.4 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఈ రిజర్వాయర్‌లలో ఉన్న నీటి లభ్యతను బట్టి వెలుగోడు రిజర్వాయర్ కింద సాగు చేసుకున్న పంటలకు ఈ నెల చివరి వరకు, గోరుకల్లు, అవుకు రిజర్వాయర్ కింద సాగు చేసుకున్న పంటలకు డిసెంబర్ చివరివరకు వార బంధీ ప్రకారం నీళ్లు ఇస్తామని నీటి పారుదల శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. కెసి కెనాల్ కింద సాగు చేసుకున్న వరి, మిర్చి, మినుము పంటలకు పూర్తి స్థాయిలో నీళ్లు ఇవ్వలేమని అధికారులు పేర్కొంటున్నారు. వెలుగోడు బాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ఉన్న 5 టిఎంసిల నీటిలో కేవలం 3 టిఎంసిలు మాత్రమే పంట పొలాలకు వాడుకోవడానికి అవకాశం ఉంది. మిగిలిన 2 టిఎంసిలు తాగునీటి అవసరాల కోసం ఉంచారు. ఇదే పరిస్థితి అన్ని రిజర్వాయర్‌లలో ఉంది. రబీలో సాగు చేసిన పంటలకు కెసి కింద చివరి ఆయకట్టు వరకు నీళ్లు రావడం లేదని, సాగునీరు ఇవ్వాలని నంద్యాల నియోజకవర్గంలోని నంద్యాల, గోస్పాడు మండలం, ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని సిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి, దొర్నిపాడు మండలాల అన్నదాతలు ఆందోళన బాటపట్టారు. నీళ్లు ఇవ్వకుంటే పంటలు ఎండిపోతాయని రైతులు వాపోతున్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఖరీఫ్‌లో వరితో పాటు మినుము, మిరప, జొన్న, పత్తి తదితర పంటలు సాగు చేశారు. ఎక్కువగా వరి మినుము, మిరప స్టాండింగ్ పంటలు ఉన్నాయి. ఈ పంటలకు చివరి ఆయకట్టు వరకు నీళ్లు పంటలకు అందడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరి ఆయకట్టు వరకు అధికారులు నీళ్లు ఇవ్వకుంటే తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. వార బందీ కింద ఇక కేవలం పదిరోజులే ఇచ్చే అవకాశం కెసి కెనాల్‌కు ఉంది. ఆ తరువాత ముచ్చుమర్రి ఎత్తిపోతల స్కీమ్ నుండి పంపింగ్ ద్వారా నీళ్లు కెసికి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం నీటి నిల్వలను పట్టి చూస్తే రైతన్నకు నీటి కష్టాలు తప్పేలా లేవనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఈ పది రోజుల్లో వరుణుడు కరుణిస్తేనే రైతన్నకు నీటి కష్టాల బయటే పడే అవకాశం ఉంటుందని నీటి పారుదల అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


జనవరి చివరి వరకు సాగు నీరు ఇవ్వాలి



నంద్యాల జిల్లాలో ఇరిగేషన్ అధికారులు నవంబర్ నెల చివరి వరకు మాత్రమే సాగునీరు అందిస్తామని ప్రకటిస్తున్నారు. అందువల్ల జిల్లాలో పంటలు సాగు చేసుకున్న రైతాంగం తీవ్రంగా నష్టపోతారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు సాగు నీటి ప్రకటనల వల్ల తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకొని జనవరి నెల చివరి వరకు కెసి కెనాల్, తెలుగంగ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేసి పంటలు ఎండిపోకుండా చూడాలి. రైతాంగాన్ని ఆదుకోవాలి..

టి. రామచంద్రుడు, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి.

కెసికి రెగ్యులర్‌గా నీళ్లు ఇచ్చి మిర్చి పంటను కాపాడాలి



రెండు ఎకరాల్లో మిరప పంట సాగు చేశాను. ఇంకా పూతకే రాలేదు.. అధికారులు మాత్రం సక్రమంగా సాగునీరు ఇవ్వడం లేదు. ఇప్పటికే పంటకు దాదాపు 80 వేల రూపాయలు పెట్టుబడి పెట్టాను. పంట చేతికి రావాలంటే సాగు నీరు చాలా అవసరం.. కాబట్టి కెసి కెనాల్‌కు రెగ్యులర్ గా నీళ్లు ఇచ్చి మిర్చి రైతులను ఆదుకోవాలి.

ఎన్.చెన్నయ్య, మిరప రైతు, పసురపాడు గ్రామం.

పంట ఎండితే అప్పుల పాలే..



పుసులూరు గ్రామంలో 20 ఎకరాలు కౌలుకు తీసుకుని జొన్న పంట వేశాను. విత్తనం వేసినది మొదలుకొని ఇంతవరకు కాలువకు చుక్క నీరు రాలేదు. జొన్న పంట అంతా ఎండిపోతుంది. ఏం చేయాలో అర్థం కాక ఆకాశం వైపు చూస్తే మేఘాలు కూడా కరుణించడం లేదు. భూమిని నమ్ముకుని పెట్టుబడికి అప్పులు చేశాను. కాలువకు నీరు రాకపోతే పంటలు ఎండిపోయి అప్పులపాలు కావ్వాల్సిందే.

కౌలు రైతు మహేశ్వర్ రెడ్డి, కొత్తపల్లి గ్రామం.

తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలి

- రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ముసాయిదా ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా రూపొందించాలని, అందుకు ఒక చెక్ లిస్టు పెట్టుకోవాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లకు సూచించారు. గురువారం విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ నాటికి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, ఓటర్ల జనాభా నిష్పత్తి, లింగ నిష్పత్తి, ఓటర్ల నమోదు, అనామలిస్ ఓటర్ల పెండింగ్, ముసాయిదా జాబితాలో ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఎపిక్ కార్డుల ప్రింటింగ్, పంపిణీ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, డిఆర్ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జాబితాలో ఒకే రకమైన ఫొటోలు, ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి మారిపోయినవి, మృతులు, ఒక ఇంటి నెంబర్‌పై 10 కంటే ఎక్కువ ఓట్లు, ఒకే వ్యక్తి పేరున రెండు మూడు అంతకన్నా ఎక్కువ ఓట్లు ఉండడం లాంటి సిమిలర్ ఓట్ల తొలగింపునకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు బాధ్యతాయుతంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్పష్టమైన ముసాయిదా ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ నాటి నుండి ఇప్పటి వరకు ఫారం-6 దరఖాస్తులు 20,319, ఫారం-7 దరఖాస్తులు 11,528, ఫారం-8 దరఖాస్తులు 8907 పెండింగ్‌లో వున్నాయని చెప్పారు. వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారులు, తహశీల్దారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎన్నికల పాపులేషన్ రేషియో, జెండర్ రేషియో, జంక్ క్యారెక్టర్స్, 10 కంటే ఎక్కువ ఓట్లు వుండి పెండింగ్‌లో ఉన్న వాటికి సంబంధించి ఇంటింటి సర్వేలో పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఓటర్ల జాబితాలో సవరిస్తామన్నారు. గత నెల 27వ తేదీ ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 957 ఓటర్లు అదనంగా నమోదు కాగా షిఫ్ట్, డబల్, డెత్ తదితర కారణాలవల్ల 3089 తొలగించగా, నవంబర్ 15 నాటికి జిల్లాలో 13,56,152 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. రాజకీయ పార్టీలతో తరచుగా సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభ్యర్థనలు అభ్యంతరాలను కూడా పరిగణ లోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్డీవోలు శ్రీనివాసులు, ఎం.దాసు, వెంకటరెడ్డి, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం మోటార్లు వినియోగిస్తే చర్యలు

- ప్రధాన కాలువ తూముల వద్ద రైతులు ఉండరాదు
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కెసి కెనాల్ ఆయకట్టు కింద పంటలు సాగు చేసిన రైతులు పంట పొలాలకు మోటార్ ఇంజన్ల ద్వారా అక్రమంగా నీటిని వినియోగిస్తే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత మండలాల తహశీల్దారులు, పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్లో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కెసి కెనాల్ వారబందీ నీటి విడుదలపై ఇరిగేషన్, వ్యవసాయ, సంబంధిత మండల తహశీల్దారులు, పోలీసు అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కెసి కెనాల్ పరివాహక ప్రాంతంలో అక్రమ నీటి వాడకాన్ని అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. కెసి ప్రధాన కాలువ నుండి మోటార్ ఇంజన్ల ద్వారా అక్రమంగా నీటిని వాడితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. తహశీల్దార్, ఎంపిడిఒ, కెసి కెనాల్ ఇంజనీరింగ్ అధికారి, ఎస్సై, వ్యవసాయ అధికారి మండల బృందంగా, విఆర్వో, పంచాయతీ కార్యదర్శి, పోలీస్, వ్యవసాయ, ఇరిగేషన్ సిబ్బంది గ్రామ బృందాలుగా ఏర్పాటై కాలువల వెంట పర్యవేక్షించాలని ఆదేశించారు. కెసి కెనాల్ ప్రధాన కాలువ తూముల సమీపంలో రైతులు ఉంటే చర్యలు తీసుకోవాలన్నారు. దొర్నిపాడు మండలంలో కొంతమంది రైతులు కెనాల్‌పై అక్రమంగా పైపులు వేసుకొని దిగువ ఆయకట్టుకు నీరందకుండా అడ్డుకుంటున్నారని, స్లూయిస్‌ల దగ్గర ఇష్టం వచ్చినట్లు ఆపరేట్ చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కెనాల్ మీద వ్యవసాయ మోటార్లు వినియోగించ కుండా నిరంత రాయంగా పెట్రోలింగ్ నిర్వహిం చాలని చెప్పారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచిం చారు. పొన్నాపురం నుండి 16వ లాక్ వరకు (జిల్లెల), 16వ లాక్ నుండి 27వ లాక్ వరకు (ఆళ్లగడ్డ) దిగువ ప్రాంత రైతులకు 7 రోజులు చొప్పున వారబందీ ప్రకారం నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కెసి కెనాల్ ఈఈని ఆదేశించారు. పై ప్రాంతాల్లో ఉన్న రైతులే నీటిని కట్టుకోకుండా కింది ప్రాంత రైతులకు కూడా నీరు వదిలేందుకు ఒప్పందం చేసుకొని రైతులు సమన్వయంతో వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉన్న నీటి వనరులను చక్కగా సద్వినియోగం చేసుకొని వీలైనంత అధిక ఆయకట్టుకు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రబీ సీజన్‌లోని పంటలకు నీరు ఇచ్చే అవకాశం లేనందున రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం ఇవ్వాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కెసి కెనాల్ ఆయకట్టు రైతులకు వారబందీ ప్రకారం నీరు ఇచ్చే సమాచారాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు తెలియజేయాలని సూచించారు.

డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు దిశగా చర్యలు

- గ్రంథాలయ సంస్థ ఉమ్మడి జిల్లా చైర్మన్

ప్రజాశక్తి - నంద్యాల

డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థిని విద్యార్థులు పాఠకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ ఉమ్మడి కర్నూలు జిల్లా చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ తెలిపారు. గురువారం స్థానిక పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ నిర్వహించారు. గాడిచర్లహరిసర్వోత్తమ రావు, అయ్యంకి వెంకట రమణయ్య, ఆర్ఎస్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇంచార్జ్ గ్రంథాలయాధికారి ఆర్ఇ శ్రీధర్ మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ నాయకులు ధనుంజయ ఆచారి, షేక్ ఇన్నోస్ భాష, బత్తల లక్ష్మీకాంతయ్య, గ్రంథాలయ అధికారులు డి.మధు, యం.రవిరజు, బి.బాగ్యమ్మ , కె సుజాత, ఎం అరుణ కుమారి, పాఠకులు పాల్గొన్నారు. **పాణ్యం:** గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ లైబ్రరియన్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. అసిస్టెంట్ వెటర్నరీ డైరెక్టర్ కమలాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** గ్రంథాలయాల అభివృద్ధికి గాడిచర్ల హరి సర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణంల కృషి ఎనలేనిదని గాడిచర్ల వంశీకులు గాడిచర్ల మాధవరావు, రిటైర్డ్ హెచ్ఎం శ్రీరాములు పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో గాడిచర్ల హరి సర్వోత్తమ రావు, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణంల చిత్రపటాలకు గ్రంథాలయ అధికారి బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుర ప్రముఖులు బిఎస్ ప్రసాద్, దస్తగిరి, హుస్సేన్ నాయక్, మహమ్మద్ రఫీ, సైగల్, పాఠకులు పాల్గొన్నారు. **పాములపాడు :** స్థానిక శాఖ గ్రంథాలయం నందు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పాములపాడు మండలం వైసిపి అధ్యక్షుడు ఎల్. రామలింగేశ్వర్ రెడ్డి పాల్గొని సందర్భంగా గ్రంథాలయ ఉద్యమ నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని, గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం **మిగతా 6వ పేజీలో...**



గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

18న మైనింగ్ యజమానులతో సమావేశం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె : బనగానపల్లె నియోజకవర్గంలోని నాపరాతి పరిశ్రమ, మైనింగ్ యాజమానులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 18న మధ్యాహ్నం 3 గంటలకు బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించే సమావేశానికి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, విద్యుత్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు. నియోజక వర్గంలోని మైనింగ్ లీజు దారులు, నాప రాతి పరిశ్రమ యాజమానులు హాజరై సలహాలు, సూచనలు తెలియజేసి, సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

నేడు, రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని పాతపాడు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్ర, శనివారాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని బనగానపల్లె ఏడి మద్దిలేటి, టౌన్ ఏఈ శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాతపాడు సబ్ స్టేషన్‌లో అదనంగా 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తుండడంతో నేడు, రేపు ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. రైతులకు ఈ రెండు రోజుల్లో తెల్లవారుజామున 3 నుండి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ రెండు రోజులు రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

యాగంటిని సందర్శించిన ప్రెస్ అకాడమీ చైర్మన్

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానాన్ని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు దంపతులు గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొమ్మినేని శ్రీనివాసరావు దంపతులు ఆలయం వద్దకు చేరుకోగానే ఆలయ సిబ్బంది సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ప్రెస్ అకాడమీ చైర్మన్ దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



యాగంటి దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస్ దంపతులు

ఉపాధ్యాయుడు మాధవస్వామి సస్పెండ్

- మరో ఉపాధ్యాయుడికి డిఇఒ మెమో జారీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

బనగానపల్లెలోనిజిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం జానకికి వ్యతిరేకంగా విద్యార్థులతో ధర్నా చేయించిన ఉపాధ్యాయుడు మాధవ స్వామిని సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుధాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరో ఉపాధ్యాయుడు క్రిష్ణారెడ్డికి మెమో జారీ చేసినట్లు తెలిపారు. బనగానపల్లెలో ఈ నెల 8వ తేది 10వ తరగతి ఇంగ్లీషు మీడియం విద్యార్థులు భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు మాధవ స్వామి, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు క్రిష్ణారెడ్డిలు హెచ్ఎం జానకికి వ్యతిరేకంగా విద్యార్థులతో ధర్నా చేయించారని తెలిపారు. క్రిష్ణారెడ్డి హెచ్ఎంకు వ్యతిరేకంగా మీడియా ముందు మాట్లాడారని, ఉపాధ్యాయుల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలకు, అహంకారాలకు విద్యార్థులతో ధర్నా చేయించడం బాధాకరమన్నారు. ఇటువంటి చర్యలు చట్ట వ్యతిరేకమని, పాఠశాలలో విచారణ చేపట్టగా ఉపాధ్యాయుడు మాధస్వామి విద్యార్థులను ధర్నాకు ప్రోత్సహించినట్లు తేలిందన్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు క్రిష్ణారెడ్డి కూడా మాధవ స్వామి ప్రోత్సాహంతోనే ధర్నాలో పాల్గొన్నారని చెప్పారు. ఉపాధ్యాయుడు మాధవ స్వామినే దీనికి మూల కారణమని రుజువుకావడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. అలాగే తప్పును ఒప్పుకుంటూ వివరణ ఇచ్చిన క్రిష్ణారెడ్డికి పనిష్మెంట్ ఇచ్చేందుకు చార్జి మెమో జారీ చేసినట్లు పేర్కొన్నారు. హెచ్ఎంపై వచ్చిన అభియోగాలను వివరిస్తూ విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులకు నివేదిక సమర్పించినట్లు తెలిపారు. ఎవరైనా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, మిగతా విద్యాశాఖకు సంబదించిన మిగతా ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరూ కలిసి విద్యార్థులు అకాడమిక్ స్టాండర్డ్స్ పెంచేందుకు కృషి చేయాలని సూచించారు.

నీటి హక్కుల్లో కోతలపై పట్టని రాష్ట్ర ప్రభుత్వం

- రాయలసీమ సాగునీటి సాధన సమితి

ప్రజాశక్తి - నంద్యాల

గత నెల తెలంగాణకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గెజెట్ నోటిఫికేషన్ ద్వారా రాయలసీమకు తరతరాలుగా ఉన్న నీటి హక్కుల్లో కోత విధిస్తూ నిర్ణయం తీసుకున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా ఉందని, చీకటి చట్టం రద్దుకు అందరూ ఉద్యమించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామి రెడ్డి తెలిపారు. శ్రీబాగ్ ఒడంబడిక 86వ వార్షికోత్సవం సందర్భంగా రాయలసీమ హక్కుల దినోత్సవ సభ గురువారం నంద్యాలలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వై.యస్. రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. శ్రీబాగ్ ఒడంబడికతో చేపట్టాల్సిన పాలనా వికేంద్రీకరణలో భాగంగా కర్నూలులో హైకోర్టు ఏర్పాటు, కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిగా విస్మరించి నేడు శ్రీబాగ్ ఒడంబడిక రోజును కూడా పూర్తిగా విస్మరించి, మొఖం చాటు వేశారని విమర్శించారు. ఈ దుస్థితి నుండి బయటపడడానికి ప్రజలు పెద్ద ఎత్తున పాలకులపై తిరుగుబాటుకు సిద్ధం కావాలన్నారు. బాల ఈశ్వర రెడ్డి, పిడిఎస్‌యు రాంబాబు, అడ్వకేట్ శంకరయ్య, ఎపి రైతు సంఘం రాజశేఖర్, వాల్మీకి సంఘం అధ్యక్షులు పులికొండన్న, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆత్మకూరు రవీంద్ర, రాజా విక్రమ్, ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఎజిఎం శివనాగి రెడ్డి తదితరులు మాట్లాడారు. సాగునీటి సాధన సమితి చేపట్టే ప్రత్యక్ష కార్యాచరణ కార్యక్రమాలలో పాల్గొని రాయలసీమ హక్కులను నిలబెట్టడానికి కృషి చేస్తామన్నారు. సంతజుటూరు కృష్ణారెడ్డి సభలో తీర్మానాలను ప్రవేశపెట్టారు. అనంతరం బొజ్జా దశరథరామిరెడ్డి రచించిన 'నీటి అవగాహనే రాయలసీమకు రక్ష' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున రైతులు, విద్యార్థులు, నంద్యాల పుర ప్రముఖులు పాల్గొన్నారు.



నీటి అవగాహనే రాయలసీమకు రక్ష పుస్తకం ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

- రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించండి : మాజీ మంత్రి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం మండలంలోని అహోబిలం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గూడూరు సంజీవరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల కష్టనష్టాలను తెలుసుకొని వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో టిడిపి గెలుపునకు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. దోచుకోవడమే తప్ప ప్రజలకు సేవ చేయాలని ఆలోచన ఎమ్మెల్యేకి ఏమాత్రం లేదన్నారు. కార్యక్రమంలో టిడిపి అహోబిలం నాయకులు పగడాల గంగాధర్, ఎంవి ప్రసాద్, వీరభద్రుడు, నరేష్, బాలాచారి, సుధాకర్ రెడ్డి, వేలంగి రాజీ. రామంజి, బద్రి రమణ, రాంబాబు, భోదనం పాములేటి తదితరులు పాల్గొన్నారు. **సంజామల :** రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఎగ్గోని గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా గెలిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ ఆలోచించి టిడిపికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సంజామల కోడూరు పుల్లయ్య, మద్దిలేటి, మల్కి హుస్సేన్, ముక్కమల్ల చంద్రశేఖర్ రెడ్డి, ముదిగేడు రాజగోపాల్ రెడ్డి, అక్కంపల్లి రామసుబ్బారెడ్డి, ఎగ్గొని గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ



మాట్లాడుతున్న బిసి జనార్దన్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న సబ్ డిఎఫ్ఒ శ్రీనివాసరెడ్డి

ఫారెస్ట్ రేంజ్ సబ్ డివిజన్ అధికారిగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం ఫారెస్ట్ రేంజ్ సబ్ డివిజన్ అధికారిగా శ్రీనివాసరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన రుద్రవరం అటవీ క్షేత్రధికారి కార్యాలయం, రుద్రవరం కలప డిపో కార్యాలయంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అటవీ, వన్యప్రాణి సంరక్షణకి సంబంధించిన సూచనలు సిబ్బందికి ఇచ్చారు. ఆయన వెంట రేంజి అధికారి శ్రీపతినాయుడు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, బీట్ ఆఫీసర్లుసురేంద్ర గౌడ్, నరసింహ రెడ్డి కూప్ మేస్రి కిట్టు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే టిడిపి, జనసేన లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్ర ప్రజల సంక్షేమమే టిడిపి, జనసేన లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గంలోని టిడిపి, జనసేన ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశం మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ క్షేమం, రాష్ట్ర ప్రజల స్వేచ్ఛ, వైసిపి రాక్షస పాలన అంతం కోసం టిడిపి, జనసేన కలిసి పని చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గస్థాయిలో ఉమ్మడి కార్యాచరణ ఏర్పాటు చేసుకొని సమిష్టిగా వైసిపి దౌర్జన్యాలను ఎదుర్కోవాలన్నారు. జనసేన నాయకులు భాస్కర్ , సురేష్‌లు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన ప్రభుత్వ ఏర్పాటుకు కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, బనగానపల్లె, కొలిమిగుండ్ల మండలాల అధ్యక్షులు పివి కుమార్ రెడ్డి, మూలే రామేశ్వర రెడ్డి, జనసేన నాయకులు చిన్న బాబు, గుర్రప్ప, అజిత్ రెడ్డి, పూల విక్రం, పెద్దయ్య పృథ్వి, నియోజకవర్గంలోని ఐదు మండలాల టిడిపి, జనసేన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్య

- కోరమాండల్ కంపెనీ మరిన్ని సేవలు చేయాలి
- ఆవుల నారాయణరెడ్డి సేవలు అభినందనీయం : ఎంపీ, ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి చిత్రంలో ఎమ్మెల్యే ఆర్థర్

ప్రజాశక్తి - పాములపాడు

రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలోని విద్య ఉందని, సిఎం జగన్మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. పాములపాడు మండలం బానకచెర్ల గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు-నేడు పథకం కింద అభివృద్ధిపరిచిన ప్రభుత్వం పాఠశాలను ప్రముఖ పారిశ్రామికవేత ఆవుల వెంకట నారాయణ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఆవుల జయసుధల అభ్యర్థన మేరకు కోరమాండల్ కంపెనీ వారు వాటికి తోడుగా మరికొన్ని పెయింట్స్, స్టేజ్ పైకప్పు, ఒకటి నుండి ఆరో తరగతి వరకు విద్యార్థులకు డిస్కులు, కుర్చీలు, ఆట వస్తువులు తదితర వాటికి రూ.11 లక్షలతో పాఠశాలకు సదుపాయాలను కల్పించిన వాటిని ప్రారంభించేందుకు గురువారం నాడు ముఖ్య అతిథులుగా ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే ఆర్థర్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలోనూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని వసతులు కల్పిస్తున్నారని, మంచి ఉపాధ్యాయులను ప్రభుత్వం ఇస్తోందన్నారు. దేశానికి ప్రధానమంత్రి అయిన శాస్త్రవేత్త అయిన పెద్ద రాజకీయవేత అయిన రాష్ట్రపతి అయిన ఎక్కువ శాతం గ్రామీణ ప్రాంతం నుంచి వెళ్లిన వారే అని, కష్టపడి చదివిన వారేనని అన్నారు. తల్లి, తండ్రి, గురువు, దైవం తల్లిదండ్రుల తర్వాత గురువే విద్యార్థికి భవిష్యత్తును ఇచ్చేదని అలాంటి ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువరాదన్నారు. ప్రతి విద్యార్థి మంచిగా చదువుకొని గ్రామానికి సేవ చేసేవిధంగా ఎదగాలన్నారు. ఆవుల నారాయణరెడ్డి తన గ్రామానికి సేవ చేసే దృక్పథంతో వచ్చారని, వారిని ప్రతి ఒక్కరు ఆహ్వానించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు కోరమాండల్ వారు మరిన్ని చేయాలని వారు వారిని అభినందించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలను, ఆవుల నారాయణరెడ్డి, జయసుధలను కోరమాండల్ వారు సన్మానించారు. కోరమండల్ వారిని సర్పంచి కుటుంబం సన్మానించింది. ఎంపీడీవో గోపికృష్ణ, తాసిల్దార్ రత్న రాధిక, ఎస్సై జి అశోక్‌లను, వైసీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వర రెడ్డిని సైతం సన్మానించారు. మండల వైసిపి అధ్యక్షులు రామలింగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఇలాంటి కార్యక్రమాలు కోరమండల్ కంపెనీ వారు చేసేందుకు ముందుకు రావాలని వారు ఆహ్వానించారు. కోరమండల్ వైస్ ప్రెసిడెంట్ జి వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు కర్నూలు జిల్లాలో ఎక్కువ చేసామని, మరిన్ని కార్యక్రమాలు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యు డి ఈ విద్యాసాగర్, ఎంఈఓ బాలాజీ నాయక్, అడిషనల్ సిడిపిఓ మంగవల్లి, కోరమండల్ హెడ్‌సిఎస్‌ఆర్ జయ గోపాల్, చతుర్, కంపెనీ ప్రతినిధులు శ్రీధర్, గోవిందరాజులు, సుధాకర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే


పాములపాడు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్


నందికొట్కూరు : కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు


బండి ఆత్మకూరు : మాట్లాడుతున్న మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు జయరెడ్డి చిన్న సంజీవరెడ్డి


మాట్లాడుతున్నజిల్లా జెసిఎస్ కోఆర్డినేటర్ షేక్ బాబూలాల్

ప్రజాశక్తి - పాములపాడు

ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. గురువారం ఇస్కాల గ్రామంలో పల్లకి వెళ్దాం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై గ్రామానికి వచ్చిన ప్రభుత్వ పథకాల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రాజకీయాలకు అతీతంగా, కులం, మతం చూడకుండా అన్ని వర్గాల ప్రజలకు వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. వైసిపిని ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోపికృష్ణ, తాసిల్దార్ రత్న రాధిక, ఈఓఆర్‌డి శ్రీనివాస్ నాయుడు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచ్ మౌలాలి, వైసిపి మండల నాయకులు రమణారెడ్డి, నాయకులు మాలిక్ బాష, అంబన్న, మద్దూర్ ఎంపీటీసీ బషీర్ అహ్మద్, పాణ్యం నాగిరెడ్డి, రాములమ్మ, బాలీశ్వర్ రెడ్డి, రాజన్న తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 10వ సచివాలయం పరిధిలోని 6,7,8,25,28వ వార్డుల్లో 'ఏపికి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైసిపి పట్టణ జెసిఎస్ కన్వీనర్ అబూబక్కర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కౌన్సిలర్లు దేశెట్టి సుమలత, నాయుబ్, షేక్ కరిష్మా, రాధిక గార్ల అధ్వర్యంలో పట్టణం లోని శాంతి టాకీస్ వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేసి, భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటి ఇంటికి వెళ్ళి పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబర్ ఉస్మాన్ బేగ్, సీ.సులోచనమ్మ, వైఎస్ఆర్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షులు చింతా విజ్జి, ఉపేంద్ర రెడ్డి, కౌన్సిలర్లు అబ్దుల్ రావుఫ్, అల్లూరి కృష్ణ, హమీద్, కో ఆప్షన్ మెంబర్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** బేతంచెర్ల పట్టణంలో ఐదవ సచివాలయం నందు సచివాలయ కన్వీనర్ డక్కి శేఖర్ ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మూర్తు జావలి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ మురళీకృష్ణ, శేఖర్, వలి బాష, అమ్మని, నాగజ్యోతి, సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్:** గ్రామ స్వరాజ్యం వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమని బండి ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు జయరెడ్డి చిన్న సంజీవరెడ్డి అన్నారు. పార్లపల్లి సర్పంచ్ షేక్ షబ్బీర్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన పల్లెకు పోదాం గ్రామ సభలో ఎంపిపి డి చిన్న సంజీవరెడ్డి, సర్పంచ్ షబ్బీర్ అహ్మద్ పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసి, ఇండ్లపైన వారి అనుమతితోనే వైసిపి జెండాను ఎగురవేశారు. రాత్రి సచివాల యంలోనే నిద్రించి మండల నాయకులు ప్రజాప్రతినిధులు శుక్రవారం ఉదయం వైసిపి జెండాను ఆవిష్కరించడం జరుగుతుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేసు వెంకట్రాంరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు భూరం శివలింగం, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విక్రమ్ సింహ నాయక్, ముంతల మధు శేఖర్, తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** చాగలమర్రిలోని 5వ సచివాలయంలో గ్రామ సర్పంచ్ తులసమ్మ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహిం చారు. ముఖ్య అతిథులుగా జిల్లా సచివాలయాల జెసిఎస్ కోఆర్డినేటర్ షేక్ బాబూలాల్ పాల్గొని మాట్లాడారు. అనంతరం వైసిపి జెండాను సర్పంచ్ తులసమ్మ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల మండల కోఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు జిగ్గి గారి ఇబ్రహీం, ఎంపీటీసీ ఫయాజుద్దీన్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా జాబిర్, మండల బీసీ సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు గౌడ్, ఇన్చార్జి ఈవో నాగమణి, సచివాలయ కార్యదర్శి రాజేష్, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు:** మండలంలో దామగట్ల గ్రామంలో పల్లెకు పోదాంలో నందికొట్కూరు వైసిపి మండల అధ్యక్షులు రవి యాదవ్, మండల జెసిఎస్ కన్వీనర్ ఓంకార్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు మండల ఎంపీపీ మురళి కృష్ణ రెడ్డి, జడ్పీటీసీ కలిమునిసా,నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ రాహత్ జబ్బార్, బ్రాహ్మణ కొట్కూరు సింగిల్ విండో చైర్మన్ మద్దూరు సతీష్ రెడ్డి, నందికొట్కూరు సింగిల్ విండో చైర్మన్ లక్ష్మి కాంతరెడ్డి, వైస్ ఎంపీపీ పబ్బతి జ్యోతి, రవి, బొల్లవరం సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ప్రశ్నిస్తే దాడులా..? : టిడిపి

ప్రజాశక్తి - కొత్తపల్లి

సమస్యలను పరిష్కరించమని ప్రశ్నిస్తే దాడులు చేయడం సిగ్గుచేటని అని టిడిపి మండల నాయకులు శివారెడ్డి, మధుసూదన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి నాగ శేషన్న యాదవ్ తెలిపారు. గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ గురువారం నందికొట్కూరు పట్టణంలో ఉన్న మారుతి నగర్‌లో ఏపీకి జగన్ ఎందుకు కావాలనే కార్యక్రమం జరుగుతుండగా టిడిపి నాయకులు సురేష్ కాలనీ సమస్యలను వివరించడంతో వైసిపి నాయకులు ముక్కుముడిగా సురేష్‌పై దాడి చేయడం బాధాకరమన్నారు. సమస్యలను ప్రశ్నిస్తే దాడులు చేయడమా అని ప్రశ్నించారు. రాబోవు రోజుల్లో వైసీపీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. నందికొట్కూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకుల అరాచకాలకు, రౌడీ రాజ్యానికి అంతులేకుండా పోతోందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకుల అరాచక పరిపాలనను స్వస్తి పలకాలి అన్నారు. లేనిపక్షంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామసుబ్బయ్య, హరి ప్రసాద్ రెడ్డి, రహీం ఖాన్, టిడిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.


ఫోటో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వైసిపి నేతలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి -నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని మున్సిపాలిటీ 26వ వార్డులో పట్టణ టిడిపి నాయకులు ఎస్ఎండి జమిల్, రసూల్ ఖాన్ ఆధ్వర్యంలో కార్పెంటర్ బాషా వైసీపీ వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. గురువారం నాడు నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో 50 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా మాండ్ర మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన నచ్చక టిడిపిలో చేరుతున్నారన్నారు. అనంతరం టిడిపి నాయకులు బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోవు స్థానిక ఎన్నికలలో టిడిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జయ సూర్య, కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, ముత్తు జావలి, పలుచాని మహేశ్వర్ రెడ్డి, షకీల్ అహ్మద్,గుండం రమణారెడ్డి, గిరీశ్వర్ రెడ్డి, పల్లె రఘునాథ్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి,జి.నాగమణి, బియ్యం జనార్ధన్, శాలు,తమ్మడిపల్లి ఏసేపు,శాంతరాజు, కళాకర్ , నిమ్మకాయల రాజు, మోహన్, నరసింహారెడ్డి, బి. రాజన్న, మసాలా కాజా, ప్రభు కుమార్, ఫైజుల్లా, ఉస్సేన్, మట్ట, సురేష్, హరి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థాన నిత్య అన్నప్రసాద వితరణ పథకానికి గురువారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. కర్నూలు జిల్లా చెందిన వెంకటేశ్వర రెడ్డి రూ.1,00,116 విరాళాన్ని ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఐ.ఎన్.వి. మోహన్‌కు అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎన్ సింహాద్రి అప్పన్న రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. దాతలకు శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసినట్లుగా ఆలయ అధికారులు తెలిపారు.


బనగానపలె : గ్రంథాలయ పితామహులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు దిశగా చర్యలు

5వ పేజీ తరువాయి... చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, పాఠకులు వీరన్న. సుబ్బరాయుడు, గౌడు, రవి, విద్యార్థులు పాల్గొన్నారు. **పగిడ్యాల:** ఎంతోమంది ఉద్యమకారుల వల్లే గ్రంథాలయాలు ఏర్పడ్డాయని గ్రంథాలయ అధికారిని మద్దమ్మ అన్నారు. 56వ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం పగిడ్యాల గ్రంథాలయము నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని మాట్లాడారు. గాడిచర్ల హరి సర్వోత్తమ రావు, ఎస్ఆర్ రంగనాథ్, పోతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటర మణయ్య ఉద్యమాలు చేసి గ్రంథాలయాలు ఏర్పడే విధంగా కషి చేశారన్నారు. అనంతరం వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. **చాగలమర్రి :** చాగలమర్రి పట్టణంలోని మల్లెవేముల బస్టాండు సమీపంలో గల శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను గ్రంథాలయ అధికారి రామచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారి తెలిపారు. **గడివేముల :** గడివేముల శాఖా గ్రంథాలయంలో గురువారం నాడు గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ కోసం సభను గ్రంథాలయాధికారి వి. వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల అవసరాన్ని ఆనాడే గుర్తించిన ఎస్ .ఆర్. రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య, గాడి చర్ల హరిసరోత్తమరావు ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. పి .కష్ణమూర్తి మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా ప్రజలు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు అని అన్నారు. సమాజ అభివద్ధిలో గ్రంథాలయాల పాత్ర కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొంతల ప్రసాద్,శ్రీ రాజరాజేశ్వరి హై స్కూల్ టీచర్ చెన్నయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


పాములపాడు : గ్రంథాలయ పితామహులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

పేదల అభివృద్ధే వైసిపి ధ్యేయం


నాయకులతో మండల వైసీపీ అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - పాములపాడు

పేద ప్రజల అభివృద్ధి వైసిపి ప్రభుత్వ ధ్యేయమని పాములపాడు మండల వైసిపి అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం నాడు 'జగనే రాష్ట్రానికి ఎందుకు కావాలి' కార్యక్రమంలో భాగంగా ఇస్కాల గ్రామంలో వైసిపి జెండాను రామలింగేశ్వర రెడ్డి ఎగురవేశారు. అలాగే గ్రామంలో కొందరి ఇళ్ల పైన వైసిపి జెండాలు ఎగరవేసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యంగా పాలన కొనసాగుతు ఉందని, ప్రతి ఒక్క కుటుంబానికి పథకాలు అందుతు న్నాయని, మళ్లీ జగనన్నను ఆశీర్వదించాలని రామలింగేశ్వర రెడ్డి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఇన్చార్జి టిఎన్ఆర్ నాగరాజు, సొసైటీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, నాయకులు బంగారు బాష, మిట్ట కందల సర్పంచ్ చింతల నారాయణ, డైరెక్టర్ గోపాల్, తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాదరావు, వెంకటేశ్వర రెడ్డి, ప్రభాకర్, సామిరెడ్డి, కమలాకర్, దర్గయ్య, శేషు, లింగస్వామి, గ్రామ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి ఉప సర్పంచిగా యేసురత్నం

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి ఉప సర్పంచ్‌గా పెరుమాళ్ళ యేసురత్నం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం కొత్తపల్లి ఉప సర్పంచ్ ఎన్నిక ఎన్నికల అధికారి మహేష్ ఆధ్వర్యంలో ఉప సర్పించి ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల్లో పాల్గొన్న వార్డు సభ్యులందరూ ఉప సర్పంచ్ పెరుమాళ్ళ యేసురత్నమును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఉప సర్పంచ్ ఎన్నిక రెండుసార్లు వాయిదా పడి మూడవసారి ప్రశాంతంగా జరిగింది. ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాసరావు, సిఐ నాగభూషణ్ ఎస్సై నారాయణరెడ్డిల ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ ఎన్నిక వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికైన ఉప సర్పంచ్‌ను జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, ఎంపిపి కుసుమలత, మండల వైసీపీ కన్వీనర్ సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ వార్డుమెంబర్ల సమక్షంలో ప్రమాణస్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఏసురత్నంను కుటుంబ సభ్యులు బంధుమిత్రులు తదితరులు శాలువాలు కప్పి సన్మానించారు.


ఎన్నికైన ఉప సర్పంచ్ ను సన్మానిస్తున్న నాయకులు

సంక్షేమంలో ఎపి అగ్రగామి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ సిఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గొడెగనూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు సర్పంచ్ సంజీవరాయుడు, ఎంపిటిసి పత్తినారాయణ, జేసిఎస్ జిల్లా కో ఆర్డినేటర్ షేక్ బాబూలాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,వైసిపి నాయకులు, కార్యకర్తలు క్రేన్ సహాయంతో గజమాల వేసి మోళ,తాళాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఉపసర్పంచ్ రామక్రిష్ణ, సూర్యనారాయణ, నరసింహులు, సంజీవరాయుడు, లక్ష్మయ్య, గంగన్న,నరసింహ్మారెడ్డి,తులసి,సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి,ఎంపీటీసి లక్ష్మిరెడ్డి,సింగల్ విండో అధ్యక్షుడు దస్తగిరి,తబ్బిబ్బు పవన్ (బాబు), జగదీశ్వరరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, జమాల్‌వలి, తదితరులు పాల్గొన్నారు. **గడివేముల :** మండలంలోని ఎల్కే తాండ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. అంతరం రంగస్వామి దేవాలయం వరకు కోటి 80 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గని వైస్ సర్పంచ్ ఆనంద్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కాలు నాయక్, రవీంద్రనాథ్ రెడ్డి, జడ్పిటిసి ఆర్.బి చంద్రశేఖర్ రెడ్డి, మండల అధ్యక్షురాలు నాగమద్దమ్మ, పెసరవెల్లి ఎల్లారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చంద్రమౌళీశ్వర్ రెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప తాసిల్దార్ శ్రీనివాసులు నాయకులు పాల్గొన్నారు.


గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రమాదాలకు నిలయంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు : సిపిఎం


ట్రాన్స్ఫార్మర్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్‌లో గత 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను విద్యుత్ అధికారులు కాలనీ ప్రధాన రహదారిలో నెలకొల్పడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు ఆరోపించారు. గురువారం సిపిఎం నాయకులు పి.పకీర్ సాహెబ్, సి నాగన్న, కొంగర వెంకటేశ్వర్లు కాలనీలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కాలనీకి చెందిన ఒక వ్యక్తితో కొంత మొత్తాన్ని డీడీ రూపంలో అధికారులు తీసుకొని ఈ ట్రాన్స్ఫార్మర్‌ను కాలవ రోడ్డు ప్రక్కన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతినిత్యం స్కూలుకు వెళ్లే స్కూల్ బస్సులు, ఆటోలు, పాదాచారులు, ద్విచక్ర వాహనములు, నిత్యం రద్దీగా ఉండే ప్రాం తంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయడం తగదని ఏమైనా ప్రమాదా లు జరిగితే అందుకు విద్యుత్ అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు హరి వర్ధన్, కాలనీవాసులు మా బాష, మౌలాలి, కాసిం, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో మెళకువలు నేర్చుకోవాలి

- ఉమ్మడి జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి

ప్రజాశక్తి - పగిడ్యాల

కబడ్డీ శిక్షణలో క్రమశిక్షణతో మెలకువలు నేర్చుకోవాలని మాజీ జెడ్పిటిసి, ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి, ఎంఇఓ సుభాన్ అన్నారు. పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ 17 విభాగంలో బాలుర కబడ్డీ శిక్షణ శిబిరాన్ని పాఠశాల ప్రధా నోపాధ్యాయులు మధుసూదన్ రావు, పుల్యాల నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడాకారులు మంచి క్రీడా ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయితో పాటు జాతీయస్థాయిలో మంచి గుర్తింపు సాధించాల న్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడల్లో క్రమశిక్షణ పాటించినప్పుడే విజయం వరిస్తుందన్నారు. ఏ ఆట క్రీడాకారుడైన క్రీడా స్ఫూర్తి ఉన్నప్పుడే విజయాలు తనంతట తానే వరిస్తాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు మాట్లాడుతూ పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఇప్పటివరకు 23 వివిధ రకాల క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించడం జరిగి ందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు ప్రథమ స్థానం, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో జరుగు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో ఉమ్మడి కర్నూలు జిల్లా తరపున పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు రషీద్ మియ్య, పిడి కృష్ణ, సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, జాతీయ కబడ్డీ గోల్డ్ మెడల్ కారుడు మోక్షేశ్వర్ రెడ్డి, క్రీడా శ్రీ తోకల పీతాంబ రెడ్డి క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉమ్మడి జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి

సుండిపెంటలో మాజీ ఎంపి మురళీమోహన్


పూజలు నిర్వహిస్తున్న మురళీమోహన్

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైల మండలం సుండిపెంటలోని శిరిడి సాయినాధుని తెలుగుదేశం మాజీ పార్లమెంటు సభ్యులు మురళీమోహన్ కుటుంబ సమేతంగా గురు వారం దర్శించుకున్నారు. ముందుగా శ్రీశైలంలో స్వామి అమ్మవార్ల దర్శనానం తరము శిఖర దర్శనం తర్వాత నేరుగా సాయిబాబా దేవాలయానికి చేరుకోగా ఆయనకు ఆలయ కమిటీ, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ వారు శాలువతో సన్మానించి ఆశీర్వచనాలు పలికారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - వెలుగోడు

పట్టణంలోని డిగ్రీ కళాశాల వద్ద ఉన్న చెంచు కాలనీలోని గిరిజనులకు (చెంచులకు) వెలుగోడు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా దుప్పట్లను గురువారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి, ఎస్సై వెంకటప్రసాద్, స్టార్ యూత్ అసోసియేషన్ సీఈవో హసన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులకు చేయూతనివ్వడం ఆనందనీయం అన్నారు. ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి వుండాలని అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ రాష్ట్ర కమిటీతో చర్చించి త్వరలో చెంచులకు ట్టార్ఫలిన్ పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగోడు రెడ్ క్రాస్ సొసైటీ నాయకులు మునీరుద్దీన్, సలీం, మున్నా, శేఖర్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

జగనన్న విద్యా దీవెనకు కెడిసిసిలో బ్యాంక్ ఖాతాలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలకు కేడీసీసీ బ్యాంక్‌లో బ్యాంక్ ఖాతాలు ప్రారంభిస్తున్నట్లు బ్యాంక్ మేనేజర్ రాజు వెల్లడించారు. ఈ మేరకు గురువారం బ్యాంక్ ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులు సేవింగ్స్ ఖాతా కోసం బ్యాంక్‌ల చుట్టూ తిరగవలసిన అవసరం లేదన్నారు. బ్యాంక్ ఖాతా ఓపెనింగ్ కోసం వచ్చే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమి ంచామన్నారు. అకౌంట్ కోసం వచ్చిన వారికి గంటలోగా ఖాతా తెరుస్తామన్నారు. ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన ఖాతాలో జమయిన వెంటనే సెల్ ఫోన్‌కు సమాచారం వస్తుందన్నారు. కేడీసీసీ కల్పించిన ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ ఫీల్డ్ ఆఫిసర్ రసూల్ పాల్గొన్నారు.

రిలే దీక్షలను జయప్రదం చేయండి

- అంగన్వాడీ జిల్లా అధ్యక్షులు జి షేబారాణి

ప్రజాశక్తి - బేతంచర్ల



అంగన్వాడి వర్కర్లకు కనీస వేతన చట్టం అమలు చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఈనెల 18వ తేదీ అన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల జరగబోతున్న రిలే దీక్షలను జయప్రదం చేయాలని అంగన్వాడి జిల్లా అధ్యక్షులు జి శేబారాణి కోరారు. గురువారం బేతంచెర్ల సిఐటియు కార్యాలయము నందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటూ అటు ప్రభుత్వానికి సమాజానికి ఎన్నో సేవలు అందిస్తున్న అంగన్వాడీల పట్ల పాలక ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయన్నారు. అంగన్వాడీలు తాము నిర్వహిస్తున్న విధులలో చోటామోటా రాజకీయ నాయకులు పెత్తనాలు చేస్తూ అంగన్వాడి టీచర్ల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం అందించిన సెల్ ఫోన్లు సరిగ్గా పనిచేయకపోవడం, వివిధ యాప్‌లతో అంగన్వాడీ టీచర్లను విధులు పట్ల ఒత్తిడికి గురి చేయడం సరైంది కాదన్నారు. అంగన్వాడీ టీచర్లకు ప్రభుత్వం డిఏలు చెల్లించడం లేదన్నారు. ఈనెల 18వ తేదీ అన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల ముందు అంగన్వాడీ టీచర్లు మాత్రమే రిలే దీక్షలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె తెలిపారు.